క్లుప్తంగా

ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

వీరులపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ చిట్టిబాబు పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులపై స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే అభివృద్ధి సాధ్యం

చట్టన్నవరం(వీరులపాడు): ఎస్సీ వర్గీకరణతో పాటు ఓటు చైతన్యం వస్తేనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు దొండపాటి సుధాకర్ మాదిగ పేర్కొన్నారు. మండలంలోని చట్టన్నవరం గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ ఆంధ్ర గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో పిల్లలను విధిగా చదివించాలన్నారు. అంతే కాకుండా ఓటు చైతన్యం దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాతంగి రోశయ్య, ఉపాధ్యక్షునిగా కోట కాశేశ్వరరావులతో పాటు గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కనకపూడి వెంకటరత్నం మాదిగ, కోట రాంబాబు, పచ్చిగోళ్ల కిరణ్ మాదిగ, యద్దనపూడి లక్ష్మణ్ మాదిగ, నంద్రు యరియదాస్ యాదిగ, పత్తిపాటి నాగుల్‌మీరా మాదిగ పాల్గొన్నారు.

నందిగామ ఏసీపీగా జనార్దన నాయుడు



నందిగామ: నందిగామ డివిజన్ ఏసీపీగా కె.జనార్దన నాయుడు నియమితులయ్యారు. ప్రభుత్వం బుధవారం రాష్ట్రంలో పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఇప్పటి వరకు నందిగామ ఏసీపీగా పని చేస్తున్న జి.నాగేశ్వరరెడ్డి కాశీబుగ్గ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్న కె.జనార్ధన నాయుడు ను ప్రభుత్వం నందిగామ ఏసీపీగా నియమించింది. ఈ నేపథ్యంలో నూతన ఏసీపీగా రానున్న జనార్దన నాయుడు 'సాక్షి'తో మాట్లాడుతూ త్వరలో బాధ్యతలు స్వీకరిస్తానన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని రోమన్ క్యాథలిక్ మిషనరీ సంస్థ సెయింట్ ఆన్స్ హాస్పిటల్ అనుబంధ విభాగం కీర్తి ఎంఏసీఎస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 72 మంది నిరుపేద వృద్ధులు, వితంతువులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం కీర్తి ఎంఏసీఎస్ సొసైటీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ సుపీరియర్ సిస్టర్ మేరీ ఆంటో ముఖ్య అతిథిగా పాల్గొని సరుకులు పంపిణీ చేశారు. సొసైటీ ఇన్‌చార్జి సిస్టర్ నిర్మల మాట్లాడుతూ పేట ప్రాంతంలో అమెరికన్ ఆస్పత్రిగా సుమారు 7 దశాబ్దాలుగా వైద్య సేవలందిస్తున్న ఆస్పత్రిని స్థాపించిన మదర్ వల్‌బర్గా ఆశయాల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కీర్తి సొసైటీ గ్రూపుల్లో మహిళల ఆర్థిక సహాయంతో 40 మంది వృద్ధులు, 22 మంది వితంతువులు, ఐదుగురు దివ్యాంగులు, ఐదుగురు అనాథ పిల్లలకు సరుకులు అందజేసినట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ఇక్కట్లు



పుల్లూరు(మైలవరం): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రాంతంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక రంగాన్ని దెబ్బతీస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీహెచ్ సుధాకర్, వజ్రాల వెంకటరెడ్డి, వీ శ్రీనివాసరెడ్డి, ఎం. చరణ్, ఎల్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం

వినియోగదారుల వద్దకే విద్యుత్ శాఖ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న విద్యుత్ శాఖాధికారులు

నందిగామటౌన్: విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో బుధవారం వినియోగదారుల వద్దకే విద్యుత్ శాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యుత్ శాఖాధికారులు వినియోగదారుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు వినియోగదారుల వద్దకే విద్యుత్ శాఖ కార్యక్రమాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమున్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ అధికారులు కూడా అందుకనుగుణంగా పని చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయటంతో పాటు అవసరమైన చోట విద్యుత్ సబ్ స్టేషన్‌లను నిర్మించాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి..

రానున్న వర్షాకాలం నాటికి విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కరించి ఎటువంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ముఖ్యంగా లో వోల్టేజీ సమస్య అధికంగా ఉందని దానిని అధిగమించేందుకు కృషి చేయాలని సూచించారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని మెజార్టీ గ్రామాల్లో హైటెన్షన్ విద్యుత్ తీగలు సైతం తక్కువ ఎత్తులో ఉన్నాయని వాటి ఎత్తు పెంచేలా చూడాలని తెలిపారు. జలకళ పథకంలో భాగంగా సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయ భూముల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న బోర్లకు సకాలంలో విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైన్‌ల పనులలో జాప్యం జరుగుతుందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

అధికారుల దృష్టికి వచ్చిన ముఖ్య సమస్యలు..

- విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని పల్లగిరి, పెద్దవరం, వెల్లంకి గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు.
- ఇళ్లపై నుంచి అతి తక్కువ ఎత్తులో వెళ్తున్న విద్యుత్ తీగల ఎత్తు పెంచాలని కోరుతూ కీసర, పెద్దాపురం గ్రామాలకు చెందిన ప్రజలు వినతి పత్రం అందజేశారు.
- లో వోల్టేజీ సమస్య అధికంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కంచికచర్ల మండలం గొట్టుముక్కల, పట్టణంలోని యాదవ బజార్, ముక్కపాటి కాలనీ, కృష్ణబలిజ నగర్, రామలింగేశ్వర నగర్ ప్రాంతాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
- విద్యుత్ స్తంభాల ఎత్తు పెంచాలని ముప్పాళ్ల, అనాసాగరం గ్రామాలకు చెందిన నాయకులు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ విజయభరత్‌రావు, ఎస్ఈ మురళీమోహన్‌లు తెలిపారు. అనంతరం టెక్నికల్ డైరెక్టర్, ఎస్ఈ, అధికారులు ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, వేల్పుల ప్రశాంతి, ముక్కపాటి నరసింహరావు, అమర్లపూడి కీర్తి సౌజన్య, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్ఎన్ ప్రసాద్, పరిటాల రాము, నెలకుదిటి శివనాగేశ్వరరావు, చంద్రశేఖర్, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసరావు, ఏడీ రమేష్ బాబు, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

ప్రభుత్వ విప్ ఉదయభాను



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: మండలంలోని వేదాద్రి గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఉదయభాను నివాసంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వేదాద్రి దేవస్థానం బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను దేవస్థాన కమిటీ వారు, అధికారులతో కలిసి ఉదయభాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవస్థాన పాలక మండలి సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. వేదాద్రి దేవస్థానం సూపరింటెండెంట్ రవీంద్ర మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో మే 4వ తేదీ రాత్రి 12 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, అనంతరం 5న సాయంత్రం 7 గంటలకు కృష్ణా నదిపై తెప్పోత్సవం, పవళింపు సేవ తదితర పూజాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వేదాద్రి గ్రామ సర్పంచ్ గుడారు పేరయ్య, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి

ప్రభుత్వ విప్ ఉదయభాను



టీఎల్ఎన్ ఆచార్యులును సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆలయాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. భగవద్రామానుజుల తిరునక్షత్రం సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక నెహ్రూ చౌక్ మున్సిపల్ పార్కులో ఉన్న భగవద్రామానుజుల విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన లక్ష మల్లెల అర్చన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ పార్కును, పార్కులో వాటర్ ఫౌంటెయిన్‌ను ప్రారంభించారు. భగవద్రామానుజ గోష్ఠి వ్యవస్థాపకుడు టీఎల్ఎన్ ఆచార్యులు, ప్రతినిధులు ఆకుల స్వాతికుమార్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ పసుపులేటి సుబ్రహ్మణ్యం, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రామయ్య, ఖాదర్ బాబు, నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పూసల పుల్లారావు, తన్నీరు నాగేంద్ర, తట్టా రామానుజం, ఆకుల స్వాతికుమార్, విజయ దంపతులు, చెన్నకేశవ స్వామివారి ఆలయ భక్త బృందం పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం లక్ష్యం

- ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు
- ఉస్తేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



ఉస్తేపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

నందిగామటౌన్: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ఉస్తేపల్లి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవులలో సైతం మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థులు, రైతులు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ లబ్ధి చేకూర్చుతున్నారని గుర్తు చేశారు. కరోనా సమయంలోనూ వైఎస్ జగన్ సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా ఉండి ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నరాల హనిమిరెడ్డి, నాయకులు దొంతిబోయిన కృష్ణ, దొంతిబోయిన శ్రీను, దుద్దుకూరు వెంకట కృష్ణ, కోట ప్రసాద్, షేక్ బుడే సాహెబ్, వైఎస్ఎన్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు పాటించాలి



కీసర(కంచికచర్ల): క్రీస్తు బోధనలు పాటించాలని వరంగల్ గిఫ్ట్ ఆఫ్ జీసస్ మినిస్ట్రీస్ అధినేత బ్రదర్ జడ్సన్ అబ్రహాం తెలిపారు. మండలంలోని కీసర పెండ్యాల రోడ్డులో 25వ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా బుధవారం క్రీస్తు సువార్త రక్షణ స్వస్థత మహోత్సవాలను నిర్వహించామని పాస్టర్ గోసంగి జాన్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్రహాం పాల్గొని మాట్లాడుతూ.. క్రీస్తు అందరి ప్రభువు అని ఆయనను ఆరాధించిన వారికి ఏ కొదువ ఉండదన్నారు. ముందుగా క్రీస్తు స్తుతి గీతాలు ఆలపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సువార్త సభకు ఇతర ప్రాంతాల నుంచి విశ్వాసులు, భక్తులు తరలివచ్చారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



పరిటాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ఆదేశించారు. మండలంలోని పరిటాల గ్రామ సచివాలయం–2లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సర్పంచ్ యద్దనపూడి ఆనందజ్యోత్స్న అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఇటీవల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామని ఆ సమయంలో కొందరు సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులు కేటాయించిందని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. స్థానికంగా అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికను తయారు చేసి తనకు అందజేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, మండల గృహ సారథుల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, నాయకులు యద్దనపూడి విజయారావు, మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, జమలయ్య, వేముల నాగరాజు, ఏసుబాబు, జాన్‌బాబు, నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్



సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ సంపత్‌కుమార్

నందిగామ: ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి భూ సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. పట్టణ శివారు మున్నేటి తీరాన గల ఆర్ ఎస్ గార్డెన్స్‌లో బుధవారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకానికి సంబంధించి డివిజన్ పరిధిలోని వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో డ్రోన్ల ద్వారా చిత్రీకరించిన రీ సర్వే చిత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. సిబ్బంది క్రమశిక్షణతో పనిచేసి రీ సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సర్వే చేస్తున్న సమయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్రరావు, జిల్లా సర్వే విభాగం ఏడీ సూర్యారావు, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

బడే హజరత్ ఉరుసుకు పయనం



పెండ్యాలలో ఎడ్లబండిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు, నాయకులు

కంచికచర్ల: ప్రతి ఏడాది అత్యంత భక్తిశ్రద్ధలతో ముస్లింలు బడే హజరత్ ఉరుసు జరుపుకుంటారు. మండలంలోని పెండ్యాల మున్నేటి తీరాన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ఎడ్లబండి ఎక్కి ఉరుసును బుధవారం ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి వచ్చి ముస్లింలు బండెనెక బండికట్టి వరసగా ఉత్సవాలకు తరలివెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ, ఉరుసు ఉత్సవాలను మతాలకు అతీతంగా హిందువులతో కలసి ముస్లింలు జరుపుకుంటారని తెలిపారు. ముస్లింలు ఉరుసుకు వెళ్లేందుకు హిందువులు ఎద్దుల బండ్లను ఉచితంగా ఇస్తారని వారితో పాటే ఉత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా చీరాల, బాపట్ల, చిలకలూరిపేట, వినుకొండ, గుంటూరు, కృష్ణాజిల్లా చల్లపల్లి, అవనిగడ్డ, తెలంగాణా రాష్ట్రం ఖమ్మం, నల్గొండ, మిర్యాలగూడ, వైరా, మధిర, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి పెండ్యాల గ్రామానికి చెందిన ముస్లింలకు ఉచితంగా ఎడ్ల బండ్లను కడతారు. ఉరుసు ఉత్సవాల్లో వారు పాల్గొంటారు. నాలుగు వందల ఏళ్ల నుంచి ముస్లింలు ఈ ఉత్సవాల్లో పాల్గొని అత్యంత భక్తిశ్రద్ధలతో తుర్లపాడులో ఉన్న బడేమియా హజరత్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. ఆంధ్ర, తెలంగాణా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఉన్న పెండ్యాల గ్రామానికి చెందిన ముస్లిం సంతతికి చెందిన వారంతా ఈ వేడుకల్లో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లు, విమానాల్లో వస్తుంటారు. ఈ ఉత్సవాలు చందర్లపాడు మండలంలోని తోటరావులపాడులో కొలువై ఉన్న బడేమియా తమ్ముడిని ప్రార్థించి అక్కడ నుంచి సాయంత్రానికి తుర్లపాడు చెరువులో ఉన్న బడేమియా హజరత్ దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. చిన్నా పెద్దా తేడాలేకుండా ఆ సంతతికి చెందిన ముస్లింలంతా ఐక్యంగా ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. అంతేకాకుండా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు కులమతాలకు అతీతంగా అన్ని మతాల వారు ఎడ్లబండ్లపై వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

మజ్జిగ, వాటర్ బాటిళ్ల పంపిణీ..

ఎంపీపీ షేక్ మలఖ్‌బషీర్ ఆధ్వర్యంలో మున్నేటి తీరాన ఉర్సు ఉత్సవాలకు ఎడ్లబండ్లపై వెళ్తున్న భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు వాటర్ బాటిళ్లు ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా పంపిణీ చేయించారు. ఉరుసు ఉత్సవాలకు తరలివెళ్తున్న ముస్లింలు ఎద్దుల సవారిలను చూసేందుకు పెండ్యాల మునేటి తీరాన ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దులను చూసేందుకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యులు షేక్ బడేహజరత్, నాయకులు జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ గౌస్‌పాషా, సయ్యద్ అహ్మద్, షేక్ పీర్‌సామియా, షేక్ చాన్‌బహదూర్, వేల్పుల రమేష్, ఫయింపాష, అబ్దుల్‌కరీం, ఖాజాపాషా, పరిటాల వీరభద్రరావు పాల్గొన్నారు.



ఉరుసు ఉత్సవాలకు తరలివెళ్తున్న ముస్లింలు

పేటలో తాగునీటి సరఫరాకు ప్రణాళిక



మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: వేసవి కాలం దృష్ట్యా పట్టణంలో అన్ని వార్డుల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఒక ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని 14 సచివాలయాల వారీగా ఎమినిటీ సెక్రటరీలకు బాధ్యతలను అప్పగిస్తూ ప్రణాళికను రూపొందించామన్నారు.

1.పట్టణంలో బోర్ల మరమ్మతులకు అవసరమైన సామగ్రిని తెప్పించడానికి చర్యలు
2.పైపులైన్ లీకేజీ మరమ్మతులు
3.కృష్ణా నది నుంచి హెడ్ వాటర్ వర్క్స్ వరకు నీటి సరఫరా చేయడానికి మోటార్లు కండిషన్‌లో ఉంచడం, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినపుడు జనరేటర్లు అందుబాటులో ఉంచడం
4.నీటి సరఫరాకు అద్దె ప్రాతిపదికన రెండు ట్రాక్టర్ల ఏర్పాటు
5.కుళాయిల ద్వారా ఒక గంట సేపు నీటి సరఫరా
6.తాగునీటి సరఫరాలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే ప్రతి సచివాలయంలోని ఎమినిటీ సెక్రటరీలకు అందజేయాలి. అలాగే మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సరఫరా ఫిర్యాదులు స్వీకరించడానికి కె.వెంకటేశ్వరరావు, సెల్ నంబర్ 99499 32038, ఇంజినీరింగ్ సిబ్బందిని ఏర్పాటుచేశామని తెలిపారు. తాగునీటి సరఫరా పరిష్కారానికి డీఈఈ శివకోటేశ్వరరావు సెల్ నంబర్ 98499 07979, ఏఈ హనుమంతరావు సెల్ నంబర్ 98499 06575లను సంప్రదించాలని కోరారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి అభినందన



విద్యార్థిని తిరుపతమ్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అంకయ్య తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు ఈనెల 22న విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన 10వ అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల విద్యార్థిని ఎం.తిరుపతమ్మ ప్రతిభ కనపరచింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.అంకయ్య, కళాశాల యాజమాన్య కమిటీ కార్యదర్శి కలవకుంట్ల సాయిబాబు, ఏవో కె.సత్యనారాయణరావు తదితరులు విద్యార్థినిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తిరుపతమ్మ పవర్ లిఫ్టింగ్‌లో 57 కేజీల విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనపరచి ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అండ్ పాలకవర్గ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విద్యార్థి తిరుపతమ్మకు అభినందనలు తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ జీడీవీ ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని అభినందించారు. కోచ్ గంటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ హరినాథరెడ్డి, డాక్టర్ శివప్రసాద్

పోరాటనగర్(మైలవరం): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత గ్రామం మైలవరం మండలం పోరాటనగర్‌లోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు క్రికెట్, షటిల్, క్యారమ్ బోర్డు, చెస్ బోర్డు, రింగ్, స్కిప్పింగ్ రోప్స్, వాలీబాల్ తదితర స్పోర్ట్స్ కిట్లను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్‌కు అందజేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బీ శివహరిప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ బి. నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ అధికారి ఎం.ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.